కథ

# అసలు రోగం

ఆరె పద్మజా చౌదరి

డ్రాయింగ్ రూంలో టెలిఫోన్ అవిరామంగా మ్రోగుతోంది. సుహాస ఆగదిలోనే ఉంది. కానీ తనకేమీ ఆ ఫోనుతో సంబంధం లేనట్లు నిర్లిప్తంగా తన పని చేసుకుపోతోంది.

ఆఫీసుకెళ్ళడానికి సిద్ధమవుతోన్న గిరి బాత్రూంలో నుంచి నిదానంగా వచ్చి, ఆమెవంక నిరసనగా చూస్తూ...

"ఆ ఫోను గొంతు చించుకుంటోంది. అటెండవ్వచ్చుగా!" అన్నాడు.

సుహాస బదులివ్వలేదు. నిశ్శబ్దంగా అక్కడినుండి కిచెన్‌లోకి వెళ్ళింది.

గిరి వెళ్ళి ఫోనెత్తాడు "హలో" అన్నాడు.

వెంటనే అతని భృకుటి ముడి పడింది. రపీమని రిసీవర్‌క్రెడిల్ చేసి విసురుగా వంటింట్లో ఉన్న భార్య దగ్గరకు వెళ్ళాడు.

అతనిరాకను గమనిస్తోన్న సుహాస ఒక్కసారి ఊపిరిబిగబట్టింది. అతడు పెద్ద పెద్ద అంగలు వేసుకొంటూ వచ్చి ఆమె ఎదురుగా నిలబడి...

"ఎవడే వాడు?" అని గద్దించాడు.

"నాకు తెలియదు." శీతాకాలం మంచుకు తడసినపావు రాయి రెక్కల్లా ఆమెరెప్పలు టపటపా కొట్టుకున్నాయి.

"ఇలా ఫోను రావటం ఇది రెండో సారి. నేను లిఫ్ట్ చేసేసరికి పెట్టేస్తున్నాడు. ఎన్నాళ్ళుగాసాగుతోంది ఈ భాగోతం?"

ఆమె జుట్టుపట్టి మెడ వంచి, వీపు మీద పిడికిలో బలంగా గుద్దేడు.



చెయ్యినొప్పి పెట్టేదాకా, కొట్టి ఆమెను వదిలాడు. వెళ్తూ, వెళ్తూ "నీ రంకు వేషాలు ఎవరికోసమో నాకు తెలుసు. నీ షోకులు చూస్తేనే అర్థమవుతుంది... నువ్వెలాటిదానివో. మొన్నటిదాకా సాగిన ఆ చిట్టూగాడితో ప్రేమాయణం ముగిసిందా... కొత్తవాణ్ణి పట్టావు?" అన్నాడు.

ఆ చిట్టూ తనకన్నా ఆరేళ్ళ చిన్నవాడనీ, తమ్ముడితో సమానమైన వాడనీ అతనికి నచ్చ

చెప్పే ప్రయత్నాలు ఏనాడో విఫలమయ్యాయి గనుక ఆమె మౌనం వహించింది. అతని మనో న్యాయస్థానంలో ఆమె ఒక ముద్దాయి మాత్రమే కాదు, దోషికూడా. తనను గురించి తాను నిజం చెప్పుకునే అవకాశం లేని నిస్సహాయురాలు.

ఆమె చూపులు పడిన ప్రతి పురుషునితోనూ, వయోభేదం లేకుండా, వావి వరుసలు లేకుండా ఆమెకు అక్రమ సంబంధాలున్నాయని ఇతని అభియోగం. అతని న్యాయస్థానంలో, అతడే ఫిర్యాది. అతడే న్యాయమూర్తి. ఆమె తరఫూ, అతని తరఫూ, అతడే మాట్లాడ్తాడు.

✱✱✱

గిరి అన్నం తింటున్నాడు. అప్పుడే కరెంటు మీటరు రీడింగ్ నోట్ చేసుకొనే వ్యక్తి డిపార్టుమెంటు నుండి వచ్చాడు. అతడు వెళ్ళాక సుహాస తలుపు వేసికొని వచ్చింది.

ఆమె డైనింగు టేబులు దగ్గిరకు రాబోయింది. పెద్ద పేడసుద్దలా వచ్చి ఆమె ముఖంమీద పడింది అతని చేతిలోని అన్నం ముద్ద.

అతని ఎదురుగా కూర్చున్న అతని తల్లి వరమ్మ లబలబలాడ్తూ "ఏంట్రా ఆ పని గిరి?" అంది కోపంగా.

"నీకు తెలియదమ్మా దీని సంగతి. పూర్తిగా చెడిపోయింది. నువ్వు చూడలేదా వాడికి ఎలా కను సైగలు చేసిందో?"

"ఎవడికిరా?" తెల్లబోయింది.

"వాడికేనమ్మా ఆ కరెంటువాడికి. ఇవ్వాళ నేను చూశాను కనుక సరిపోయింది. ఎన్నాళ్ళనుండి సాగుతోందీ భాగోతం?" అన్నాడు సుహాస వైపు తిరిగి.

సుహాస తలదించుకొని అక్కడనుండి వెళ్ళిపోయింది.

"ఏంట్రా వాగుతున్నావ్?" పక్క గదిలోనుండి వెంకట్రామయ్య కోపంతో అరుస్తూ వచ్చాడు.

గిరి ఏమాత్రం తగ్గలేదు. సిగ్గుపడ లేదు. ఒక నగ్న సత్యాన్ని కనుగొన్నవాడిలా చూస్తూ "మీకేం తెలుసు నాన్నా దీని సంగతి. మొన్నటికి మొన్న ఆ ఎదురింటి కుర్రాడు ఫోను చేసు కోవటానికివస్తే..."

"నోరుముయ్యరా వెధవా. ఆమెనంటే కళ్ళుపోతాయి. పాపం మూట కట్టుకోకు." అన్నాడు వెంకట్రామయ్య.

గిరి మ్రాన్పడిపోయాడు. అదీ ఓ నిముషం. అంతే, ఆ తర్వాత గళం విప్పి, తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు.

"ఒహో... ఇది మిమ్మల్నీ వలలో వేసుకుందన్నమాట!"

ఆ రోజు సాయంత్రం అతడు ఇంటికి వచ్చేసరికి అతని మీద కోపంతో అతని తల్లి దండ్రులు వాళ్ళూరు తిరిగి వెళ్ళిపోయారు. ఎర్రబారిన కళ్ళతో ఎదురొచ్చిన ఆమెను అతడు చితకబాదేశాడు. "నీ మూలంగా మా అమ్మనాదగ్గర ఉండలేక, మా నాన్నను తీసుకొని వెళ్ళిపోయింది."

✱✱✱

ప్రక్కవీధిలో కుర్రాడు అనుకోకుండా, ఏదో తెలీని జబ్బుతో మరణించాడు. ఆ కుర్రవాడి పేరు రవి.

రవితో గిరికి బాగానే పరిచయం వుంది. తరచూ అతడు వీళ్ళ ఇంటికి వస్తుండే వాడు. అతని హఠాత్మరణంతో గిరి నాలుగు రోజులపాటు ఆఫీసుకు వెళ్ళలేదు. తనలోతానే మధనపడ్డాడు.

సుహాస ఇది ఇంకే రూపంగా పరిణమిస్తుందోనని భయపడింది.

ఐదో రోజున మినపప్పు కడు క్కుంటున్న ఆమె వద్దకు ఆవేశంతో ఊగిపోతూ వచ్చాడు.

"నువ్వే. నువ్వే. వాణ్ణి చంపేశావు" అన్నాడు. ఆమె బిత్తరపోయింది.

"అవును! నువ్వే వాణ్ణి చంపేశావు." అన్నాడు ఆమె మౌనానికి మరింతరెచ్చిపోతూ.


"నేనేం చేసాను?" అసహనం ఆమె కంఠంలో దాగనంటోంది.

"నీ జబ్బే వాడికీ అంటుకుంది. వాణ్ణివలలో వేసుకొని నీ జబ్బు వాడి కంటించావు ధాంతో వాడు చచ్చిపోయాడు. ఆ రోగం పేరు చెప్పుకోవటానికి సిగ్గేసినందుకే వాడింట్లో వాళ్ళకు జబ్బేమిటో తెలియదు. నీ మూలంగా ఇంకా ఎంతమంది చావాల్సి ఉందో! బాబోయ్! జాగ్రత్తగా ఉండమని అందరికీ చెప్పేస్తాను."

ఏదో నిర్ణయానికి వచ్చినవాడిలా సుడిగాలిలా బయటకు వెళ్ళాడు.

మరెవ్వరికీ అందని వేగంతో, మైకుతో పనిలేనంత కంఠస్వరంతో అరవసాగాడు.

"జాగ్రత్త. అందరూజాగ్రత్త! నా భార్య ఉందే, సుహాస... దాన్ని నమ్మకండి. దాని వళ్ళంతా రోగాలపుట్ట. అవి అంటుకొనే రవి చచ్చారు కున్నాడు. వాడి ఖర్మ. మీరైనా జాగ్రత్తగా ఉండండి. దాని అందంచూసి దగ్గరకు వెళ్ళకండి.




'అమృత్ కిరణ్' కార్టూన్స్ పోటీలో కన్సోలేషన్ బహుమతి పొందిన కార్టూన్

## "జాగ్రత్త. అందరూ జాగ్రత్త! నా భార్య ఉందే. సుహాస... దాన్ని నమ్మకండి. దాని ఒళ్ళంతా రోగాలపుట్ట."

మాడిపోతారు. మసైపోతారు. జాగ్రత్త...జాగ్రత్త... జాగ్రత్త..."

సుహాస స్థాణువైపోయింది. ఆమె అణు వణువూ అవమానంతో దహించుకు పోతోంది. ఏదో అదృశ్య శక్తి నడిపిస్తున్నట్లుగా పిట్టగోడనెక్కి దూకబోయింది. ఆమెను వెనుక నుండి ఎవ్వరో పట్టుకొని వెనక్కి లాగారు.

వాళ్ళు ఆమెతోపాటు ఆ కాంప్లెక్సులో వేరే ఫ్లాటులో నివసిస్తున్నవాళ్ళే. వాళ్ళు ఆ మాత్రం పట్టించుకున్నందుకే ఆమె కదలి పోయింది.

నిజానికి ఆమెకు అక్కడున్న ఎవ్వరితోనూ పెద్దగా పరిచయం లేదు. ఎవరిని పలకరించాలన్నా భయమే. ఎవ్వరి వంకచూసినా, నవ్వినా అతనికి అనుమానమే.

రెండు చేతులు ముఖానికి అడ్డు పెట్టుకొని పెద్దగా రోదించింది. ఆమెను ఓదార్చుతూ క్రిందకు తీసుకొని వెళ్ళారు.

అప్పటికే గిరిని కూడ కొందరు మగవాళ్ళు నయానా, భయానా, చెప్పి తీసుకొని వచ్చారు.

తర్వాత గిరిని, సైక్రియాట్రిస్టు వద్దకు తీసుకొని వెళ్ళారు. ట్రీట్‌మెంటు ప్రారంభం అయ్యింది. కోడలికి తోడుగా ఉండేందుకు గిరి తల్లి వచ్చింది తండ్రి రాలేదు.

గిరి మందులు వాడటానికి మొండి కేశాడు. "నన్ను చంపటానికే ఈ మందులన్నీ" అనేవాడు.

తనను రోడ్డుమీద నుండి ఇంట్లోకి తీసుకొచ్చిన వాళ్ళనూ, తనను డాక్టరు దగ్గరకు తీసుకు వెళ్ళిన వాళ్ళనూ, తన శత్రుకూటమిలో జేర్చాడు.

వాళ్ళ ముఖాన అనక పోయినా మిగిలిన వారి దగ్గర వాళ్ళంతా, తన భార్యతో చేతులు కలిపి తనను చంపే ప్రయత్నాలు చేస్తున్నారని వాపోయేవాడు.

తల్లికాకుండా భార్య అన్నం పెడితే తినేవాడు కాదు. వంటకూడ తల్లినే చేయమనే వాడు.

అతడు ఇంట్లో ఉండగా కోడలితో ఆప్యాయంగా మాట్లాడాలన్నా, అతడు నిందిస్తూంటే వారించాలన్నా ఆమెకు భయం... తనను

అతని ప్రథమ శత్రువు భార్య!
ద్వితీయ శత్రువు డాక్టరు!!

మిగిలిన వాళ్ళు సందర్భాన్ని బట్టి మారుతూ ఉంటారు. తల్లి వండి, వడ్డించినా కూడా అతనిలో ఇంకా అనుమానమే!

ఆ రోజు...

"నిస్సందేహంగా ఇందులో విషం కలిపారు!" అన్నాడు అన్నంపళ్ళెం అవతలకు నెట్టివేసి నిల్చుంటూ.

"ఎవరు కలుపుతారయ్యా. నేనేగా పెడ్తున్నాను" అంది వరమ్మ. "నువ్విందాక బాత్రూం లోకి వెళ్ళినప్పుడు అది కలిపేసిందమ్మా. నాకు తెలుసు. నన్ను చంపిగాని అది నిద్రపోదు" అన్నాడు.

అప్పటినుండి ఇదే తంతు. దాంతో సుహాసను ఆమె తల్లిదండ్రులు తీసుకుపోయారు. అతనికి నయం అయ్యాక పంపిస్తామని...

ఆమె వెళ్ళాక అతని హడావిడీ, ఆందోళనా అధికమయ్యాయి. అతన్ని ఆపటం, అదుపు చేయటం, వల్లమాలిన పని అయ్యింది. హాస్పిటల్లో ఎడ్మిట్ చేయించాల్సి వస్తుందేమో అనుకున్నారు.

డాక్టరు, సుహాసను పిలిపించవలసిందనీ, ఆమె వచ్చాక కూడ ఉపశమనం లేకపోతే ఎడ్మిట్ చేసుకుంటాననీ సూచించాడు.

సుహాసను ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాం ఇచ్చి రప్పించారు.

మానసిక వత్తిడీ, వెంట వెంట అనుకూలత లేని ప్రయాణాలు, వీటివల్ల, ఆమె మరీ కృశించిపోయింది.

వచ్చిన వెంటనే వాంతులు, నీరసంతో కళ్ళు తిరిగి పడి పోయింది.

హడావుడిగా ఆమెను లేడీ డాక్టరు దగ్గరకు తీసుకోని వెళ్ళారు.

ఆమెకేమీ ప్రమాదకరమైన జబ్బు లేదనీ, ఆమెవాంతులలో ఎలాంటి ప్రత్యేకతా లేదనీ, కంగారు పడవలసిన అవసరంలేదనీ చెప్పిన లేడీడాక్టరు చివరిగా ఒక చిన్నబాంబు లాంటిమాటను పేల్చింది.

"సుహాస ఇంకా కన్యగానే ఉంది!"

★ ★

### నాకు నచ్చిన పాటలో నేను మెచ్చని వాక్యం

ఇప్పటికీ, ఎప్పటికీ గుర్తుండే దేవదాసు సినిమాలో 'కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్...' పాటలో 'చందమామ మసకేసిపోయే' అన్న తరువాత 'ముందుగా కబురేలోయ్' అని వస్తుంది... ఈ రెండు వాక్యాలకూ సంబంధం ఏమిటో బోధపడదు.

ఈ వాక్యాల మధ్య పొంతన లేకపోయినా ఆ పాటలో ఉన్న మాధుర్యం శ్రోతల్ని మంత్ర ముగ్ధుల్ని చేస్తుంది.

కె.వి.మధుసూదన రావు, కాకినాడ.

సూపర్ డూపర్ హిట్ అయి, జాతీయ ఉత్తమ గీతంగా ఎంపికయిన 'మాతృ దేవోభవ' సినిమాలో 'రాలిపోయే పువ్వా.. నీకు రాగాలెందుకే' పాట ట్యూన్ నాకు చాలా యిష్టం! కాని అందులోని మొదటి చరణమే నాకు నచ్చలేదు. పువ్వు ఎటూరాలి పోతుంది కదా అని రాగాలు వొద్దంటే.. మనసు గాయపడి గిలగిలా కొట్టుకునే మనుషులు ఆ పాట ప్రభావంతో మరింత నిరాశా నిస్పృహలకు గురిఅవుతారు.

'కల కానిదీ విలువైనదీ బ్రతుకూ' అని బ్రతుకు మీద ఆశ.. ఎవరి జీవితమ్మీద వారికి కాన్ఫిడెన్స్ కల్గించాలే తప్ప మనుషుల్లో నిరాశా వాదం కల్గించడం మంచిది కాదని నా ఉద్దేశం.

-వెంకట్, అడవిపూడి.